# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ బీజేపీ అగ్రనేత ఎల్.కే.అడ్వాణీకి భారత రత్న పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈరోజు ప్రదానం చేశారు.
- ❖ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఇంటింటికీ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉత్తర్వులు జారీ చేసింది.
- ❖ ఓటర్లకు మెరుగైన రీతిలో సేవలు అందించేందుకు “మన పోలింగ్ బూత్ - మన ఓటు” కార్యక్రమం దోహదపడుతుందని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున పేర్కొన్నారు.
- ❖ ఐపీఎల్ టీ-20లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య విశాఖపట్నంలో క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది.
- ❖ దేశ అభివృద్ధి కోసం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని యువ ఓటర్లు తెలియజేస్తున్నారు.

================================

భారతీయ జనతా పార్టీ అగ్రనేత ఎల్.కే.అడ్వాణీకి భారత రత్న పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈరోజు ప్రదానం చేశారు. అనారోగ్య కారణాల దృష్ట్యా ఈ పురస్కారాన్ని ఆయన నివాసంలోనే ప్రదానం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రపతితో పాటు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎల్.కే.అడ్వాణీ రాజకీయాల్లో ఏడు దశాబ్దాలపైగా కీలకంగా పని చేసి దేశానికి సేవలందించారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ సందర్భంగా పేర్కొన్నారు.

================================

ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఇంటింటికీ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో సచివాలయాల్లోనే పింఛన్లను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించింది. ఎన్నికల కోడ్ కారణంగా వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకూడదని స్పష్టం చేసింది. పింఛను లబ్ధిదారులు ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు తీసుకెళ్లాలని సెర్ప్ సూచించింది. అమల్లో ఉన్న పథకాలకు సంబంధించిన ప్రయోజనాలను ప్రభుత్వ సాధారణ ఉద్యోగుల ద్వారా అందించేందుకు వీలుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓటర్లకు చేరువగా విస్తృత సేవలు అందించే ఉద్దేశ్యంతో "మన పోలింగ్ బూత్ - మన ఓటు" కార్యక్రమాన్ని చేపట్టామని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున పేర్కొన్నారు. ఈరోజు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన మన పోలింగ్ బూత్ - మన ఓటు కార్యక్రమ అమలు తీరును పరిశీలించిన కలెక్టర్.... కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అన్ని దశలలో ఓటర్లకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామని తెలిపారు. అంతకుముందు తూర్పు నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా సంయుక్త కలెక్టర్ కె. మయూర్ అశోక్ తో కలిసి పరిశీలించిన కలెక్టర్ అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల వద్దకు ఓటు వివరాలు తెలుసుకునేందుకు వచ్చిన సాధారణ పౌరులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. అలాగే అధికార యంత్రాంగం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వచ్చే నెల 2వ తేదీన చిత్తూరు జిల్లాలో సిద్ధం బస్సు యాత్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్. జగన్మోహన్ రెడ్డి పాల్గొంటారని ఉప ముఖ్యమంత్రి, వై.సీ.పీ నేత కె.నారాయణస్వామి వెల్లడించారు. ఈరోజు కార్వేటినగరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఏప్రిల్ 2వ తేదీన కుప్పం, పలమనేరు నియోజకవర్గంలో జరిగే బస్సు యాత్రలో ముఖ్యమంత్రి పాల్గొంటారని, ఈ యాత్రలో భాగంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తారని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశీ మారకపు నిల్వలు ఈ నెల 22వ తేదీతో ముగిసిన వారంలో 140 మిలియన్ డాలర్లు పెరిగి జీవన కాల గరిష్ఠ స్థాయి అయిన 642.63 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్బీఐ వెల్లడించింది. 2021 సెప్టెంబరులో ఇవి 642.45 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఫారెక్స్ నిల్వల్లో ప్రధానమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 123 మిలియన్ డాలర్లు తగ్గి 568.264 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. పసిడి నిల్వలు 347 మిలియన్ డాలర్లు పెరిగి 51.48 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐఎంఎఫ్ వద్ద మన దేశ ప్రత్యేక ఉపసంహరణ హక్కులు 57 మిలియన్ డాలర్లు తగ్గి 18.12 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడమే కాకుండా దేశ అభివృద్ధి కోసం తమ ఓటును వినియోగించుకుంటామని పలువురు యువ ఓటర్లు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పలు కళాశాలలో యువ ఓటర్లకు ఓటు నమోదు.. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన యువ ఓటరు శ్రీనివాస్ ఆకాశవాణితో మాట్లాడుతూ తమ మొదటి ఓటు దేశ అభివృద్ధి కోసమేనని పేర్కొన్నారు.

(వాయిస్ 17 సెకన్లు)

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది, తాము ఓటు హక్కును వినియోగించుకుంటామని యువ ఓటరు స్రవంతి కుమారి తెలుపుతూ...

(వాయిస్ 16 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ టీ-20లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య ఈరోజు రాత్రి 7 గంటల 30 నిమిషాలకు విశాఖపట్నంలో మ్యాచ్ జరగనుంది. అయిదేళ్ల విరామం తర్వాత ఇక్కడి వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో తిరిగి ఐపీఎల్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో నగరంలో సందడి నెలకొంది. ఈ సీజన్ లో రెండు మ్యాచ్ ల కోసం విశాఖను ఢిల్లీ క్యాపిటల్స్ సొంత వేదికగా ఎంచుకుంది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని సీఎస్‌కే (CSK) జట్టు రెండు మ్యాచ్‌లు ఆడగా రెండింటిలోనూ విజయం సాధించింది. కాగా, రిషబ్ పంత్ నేతృత్వంలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓటమిని ఎదుర్కొన్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు విజయాన్ని అందుకోవాలని పట్టుదలతో బరిలోకి దిగుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీకి తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈరోజు లేఖ రాశారు. వాలంటీర్ల ద్వారా పెన్షన్ల పంపిణీని నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు పెన్షన్ నగదు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. వృద్ధులు, వింతంతువులతో పాటు ఇతర లబ్ధిదారులకు నగదు రూపంలో పెన్షన్ మొత్తం చెల్లించాలని సూచించారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా సకాలంలో, ఎటువంటి జాప్యం లేకుండా పెన్షన్ పంపిణీ జరిపేలా చూడాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల్లో ఓటరు గుర్తింపు కార్డును చూపించి ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. ఈరోజు భీమవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఎపిక్ కార్డు లేని ఓటర్లు ప్రత్యామ్నాయంగా ఆధార్ కార్డ్, బ్యాంకులు, పోస్టాఫీసు జారీ చేసిన ఫోటోతో కూడిన పాస్‌బుక్‌లు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, పాస్ పోర్ట్, ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్లు వంటి 12 రకాల గుర్తింపు కార్డులను చూపించి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చిత్తూరు జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావు పేర్కొన్నారు. ఈరోజు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి జ్యుడిషియల్ ఆఫీసర్స్ కు నిర్వహించిన కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈరోజు వరకు తిరుపతి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన 11 మంది వాలంటీర్లను తొలగించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసేవరకు గ్రామ, వార్డు సచివాలయాల్లోని వాలంటీర్లకు అందించబడిన హ్యాండ్ హెల్డ్ పరికరాలు కలెక్టరేట్ లో జమ చేయాలని అన్నారు. జిల్లాలో కోడ్ అమలులో ఉన్నప్పటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమించినందుకు ఏర్పేడుకు చెందిన నలుగురు, నారాయణవనంకు చెందిన ముగ్గురు, రేణిగుంటకు చెందిన ఒక వాలంటీర్, పుత్తూరులో ఒక వాలంటీర్, బి.ఎన్. కండ్రిగలో ఇద్దరు వాలంటీర్లను తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =